హరీశ్‌రావును సన్మానిస్తున్న కార్పొరేటర్ మెట్టు కుమార్‌యాదవ్

హరీశ్‌రావుకు శుభాకాంక్షల వెల్లువ

పటాన్‌చెరు, డిసెంబర్ 10: సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావుకు పటాన్‌చెరు కార్పొరేటర్ మెట్టు కుమార్‌యాదవ్ వివాహ వార్షికోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. మంగళవారం తన్నీరు హరీశ్‌రావు దంపతులు వివాహ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని తిరుమలకు వెళ్లారు. హరీశ్‌రావు దంపతులకు తిరుమలలో కార్పొరేటర్ మెట్టు కుమార్‌యాదవ్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు సోమిరెడ్డి కలిసి వివాహ వార్షికోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. హరీశ్‌రావును ఘనంగా సన్మానించారు.

డ్రిప్ పరికరాలు ధ్వంసం

కోహీర్, డిసెంబర్ 10: మండలంలోని మనియార్‌పల్లి గ్రామంలో తన వ్యవసాయ చేను వద్ద ఉన్న డ్రిప్ పరికరాలను సోమవారం రాత్రి కొంతమంది ధ్వంసం చేశారని రైతు సాలె అంజయ్య ఫిర్యాదు చేశారు. బాధితుడు అంజయ్య తెలిపిన వివరాల ప్రకారం.. తన ఐదెకరాల చేనులో చెరుకు, కంది పంటను సాగు చేస్తున్నాడు. పలు గ్రామాలకు చెందిన కొంతమంది కలిసి డ్రిప్ పరికరాలను ధ్వంసం చేసినట్లు జహీరాబాద్ పట్టణ సీఐ శివలింగంకు ఫిర్యాదు చేశారు. మరోసారి ఇలాంటి ఘటనలు జరుగకుండా చూడాలని కోరాడు.

ఘనంగా వీరబ్రహ్మేంద్ర స్వామి కల్యాణోత్సవం

కోహీర్, డిసెంబర్ 10: మండలంలోని కవేలి గ్రామంలో వెలిసిన పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ ఆరాధనోత్సవాలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. వేడుకల్లో భాగంగా మంగళవాయిద్యాలు, వేదపండితుల మంత్రోచ్ఛరణల మధ్య వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణోత్సవాన్ని కనుల పండువగా చేశారు. ఈ సందర్భంగా అక్షింతలు వేసి స్వామివారి ఆశీస్సులు పొందారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. బాల్‌రాజ్, రాములు, శ్రీనివాస్, దేశికాచార్యులు పాల్గొన్నారు.

ఎస్‌జీటీ సభ్యత్వ నమోదు

జహీరాబాద్, డిసెంబర్ 10: ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించేందుకు ఎస్‌జీటీ సంఘం ఎంతో కృషి చేస్తుందని ఎస్‌జీటీ ఉపాధ్యాయ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి నిమ్మల కిష్టయ్య అన్నారు. మంగళవారం మండలంలోని రాయిపల్లి, హుగ్గేల్లి, రంజోల్, అల్గోల్, భరత్‌నగర్ పాఠశాలల్లో ఉపాధ్యాయుల నుంచి ఎస్‌జీటీ సభ్యత్వ నమోదును చేపట్టారు. కార్యక్రమంలో నాయకులు విశ్వనాథ్, షకీల్, వినయ్‌పాటిల్, కిషన్, శివకుమార్, వెంకటేశం, యాదుల్ పాల్గొన్నారు.

చెక్కుల పంపిణీ

రాయికోడ్, డిసెంబర్ 10: మండల పరిధిలోని లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. మండల కేంద్రమైన రాయికోడ్ రైతు వేదికలో మండల పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన 136 మందికి రూ.1.36 కోట్ల విలువ చేసే కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంజయ్య అందజేశారు. సీఎంఆర్ఎఫ్ కింద మంజూరైన చెక్కులను లబ్ధిదారులు 19 మందికి రూ1.44 లక్షలు చెక్కులను పంపిణీ చేశారు.

13న సామాజిక తనిఖీ

కల్హేర్, డిసెంబర్ 10: ఏడాదిపాటు మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన పనులపై 14వ విడత సామాజిక తనిఖీ ప్రజా వేదిక ఈ నెల 13వ తేదీన ఉదయం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు ఎంపీడీవో రమేశ్‌బాబు తెలిపారు. 14వ విడత సామాజిక తనిఖీ గత సంవత్సరం 1 ఏప్రిల్ 2023 నుంచి 31 మార్చి 2024 సంవత్సరం వరకు కొనసాగింది. మండలంలో చేపట్టిన వివిధ పనులపై సామాజిక తనిఖీ బృందాలు తనిఖీ చేపట్టారు. వారు సమర్పించిన నివేదికతో 13న ప్రజావేదికలో వివరాలు వెల్లడించనున్నట్లు ఎంపీడీవో తెలిపారు. ప్రజా ప్రతినిధులు, జిల్లా, మండల అధికారులు పాల్గొనాలని సమాచారం అందించామన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

జహీరాబాద్, డిసెంబర్ 10: జహీరాబాద్ పట్టణంలోని పలు కాలనీల్లో బుధవారం విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు జహీరాబాద్ పట్టణ అడిషనల్ అసిస్టెంట్ ఇంజినీర్ నాగరాజ్ తెలిపారు. పట్టణంలోని అల్లీపూర్ ఫీడర్ పరిధిలో మరమ్మతులు చేపడుతున్నామని, పట్టణంలోని ఆదర్శ్‌నగర్, దత్తగిరి, అల్లీపూర్, సాయిరాం నగర్, వెంకటేశ్వర్ కాలనీలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు. ఆయా కాలనీల పరిధిలోని వినియోగదారులు సహకరించాలని కోరారు.

తెలంగాణ అస్తిత్వాన్ని దెబ్బ తీస్తే సహించం

జహీరాబాద్: తెలంగాణ తల్లి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు



పటాన్‌చెరు: తెలంగాణ తల్లి విగ్రహానికి పాలాభిషేకం నిర్వహిస్తున్న బీఆర్ఎస్ శ్రేణులు

జహీరాబాద్, డిసెంబర్ 10: తెలంగాణ తల్లి విగ్రహ రూపురేఖలు మార్చడం సీఎం రేవంత్‌రెడ్డి మూర్ఖత్వానికి నిదర్శనమని బీఆర్ఎస్ జహీరాబాద్ మండల అధ్యక్షుడు తట్టు నారాయణ, బీఆర్ఎస్ సీనియర్ నేత నామా రవికిరణ్ ఆరోపించారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు, జహీరాబాద్ ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు పిలుపుమేరకు మంగళవారం జహీరాబాద్‌లోని భవానీ మందిర్ చౌరస్తా, న్యాల్‌కల్ మండలంలోని మల్గిలో బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో తెలంగాణ తల్లి చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేసీఆర్ మీద ద్వేషంతో తెలంగాణ అస్తిత్వాన్ని దెబ్బతీయాలని చూస్తే తెలంగాణ ప్రజానీకం ఎప్పటికీ క్షమించదన్నారు. సీఎం రేవంత్‌రెడ్డికి ఏ మాత్రం చిత్తశుద్ధి ఉన్నా ప్రజలు, రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ ఝరాసంగం మండల అధ్యక్షుడు వెంకటేశం, నాయకులు యాకుబ్, బండి మోహన్, హీరు రాథోడ్, బీఆర్ఎస్వీ న్యాల్‌కల్ మండల మండల అధ్యక్షుడు మారుతీయాదవ్ పాల్గొన్నారు.

పటాన్‌చెరులో..

పటాన్‌చెరు, డిసెంబర్ 10: తెలంగాణ తల్లి విగ్రహానికి పటాన్‌చెరులో క్షీరాభిషేకం నిర్వహించారు. పటాన్‌చెరులోని ఐబీ బంగ్లా ఆవరణలోని తెలంగాణ తల్లి విగ్రహానికి బీఆర్ఎస్ నాయకులు క్షీరాభిషేకం చేశారు. భారతీనగర్ కార్పొరేటర్ సింధూఆదర్శ్‌రెడ్డి హాజరై మాట్లాడారు. అందరి ఆమోదం పొందిన తెలంగాణ తల్లి విగ్రహం కాదని, కాంగ్రెస్ అభయహస్తాన్ని పోలిన విగ్రహాన్ని ప్రతిష్ఠించడం సబబు కాదన్నారు. కార్యక్రమంలో నాయకులు మెట్టు ఎల్లేశ్, మాజీ కార్పొరేటర్ తొంట అంజయ్యయాదవ్, బీఆర్ఎస్ మహిళా నాయకులు తదితరులు పాల్గొన్నారు.

జిన్నారం మండలంలో..

బొల్లారం, డిసెంబర్ 10: జిన్నారం మండలం వావిలాల పంచాయతీ ఎదుట తెలంగాణ తల్లి విగ్రహానికి బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు, మాజీ జడ్పీటీసీ కొలను బాల్‌రెడ్డి, చిమ్ముల గోవర్ధన్ రెడ్డి, వెంకటేశం గౌడ్ క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రాజేశ్, తాజా మాజీ సర్పంచ్‌లు శివరాజ్, రవీందర్, సురేందర్ గౌడ్, మాజీ ఎంపీటీసీ భార్గవ్ పాల్గొన్నారు.

బొల్లారం: వావిలాలలో తెలంగాణ తల్లికి క్షీరాభిషేకం చేస్తున్న బీఆర్ఎస్ శ్రేణులు

దత్తాచల క్షేత్ర అభివృద్ధికి కృషి

ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి

దత్తాచలక్షేత్రం వరకు పాదయాత్రలో పాల్గొన్న ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి

హత్నూర, డిసెంబర్ 10: హత్నూర, మాధర శివారులోని దత్తాచల క్షేత్ర ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే సునీతాల క్ష్మారెడ్డి అన్నారు. మంగళవారం దత్తభక్తులు చేపట్టిన పాదయాత్రలో పాల్గొన్నారు. అనంతరం ఆలయంలో పూజ లు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దత్తాచల క్షేత్రం ఎంతో మహిమగల ప్రాంతమని, భక్తులు కోరిన కోర్కెలు నెరవేర్చుతూ దత్తాత్రేయుడు భక్తవత్సలుడిగా విరాజిల్లుతున్నారని పేర్కొన్నారు. దత్తజయంతి ఉత్సవాల సందర్భంగా క్షేత్రం వద్ద అన్ని ఏ ర్పాట్లు చేస్తున్నామని, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని పూజారి సభాపతిశర్మ కోరారు.

హక్కులపై అవగాహన

రామచంద్రాపురం, డిసెంబర్ 10: మానవ హక్కులపై ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాలని మౌలానా అబుల్ కలామ్ ఆజాద్ నేషనల్ ఉర్దూ యూనివర్సిటీ ప్రొఫెసర్ నాగేశ్వరరావు అన్నారు. ప్రపంచ మానవ హక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం బీహెచ్ఈఎల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కన్వీనర్ తాడిబోయిన రామస్వామియాదవ్ ఆధ్వర్యంలో మానవ హక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. అనంతరం ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక హక్కుల గురించి విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ కవిత, సిబ్బంది ఉన్నారు.

సిబ్బంది విధిగా హాజరుకావాలి

రికార్డులు పరిశీలిస్తున్న జిల్లా పశువైద్యాధికారి డాక్టర్ వసంతకుమారి

ఝరాసంగం, డిసెంబర్ 10: మండల కేంద్రంలోని పశు వైద్యశాలను జిల్లా పశు వైద్యాధికారి డాక్టర్ వసంతకుమారి మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పశువులకు అందిస్తున్న వైద్య సేవలు, మందుల వివరాలను ఎప్పటికప్పుడు రికార్డుల్లో నమోదు చేయాలన్నారు. పశు వైద్యశాలకు క్రమం తప్పకుండా విధులకు హాజరై వైద్య సేవలు అందించాలన్నారు. అంతకుముందు దక్షిణ కాశీగా ప్రసిద్ధి చెందిన కేతకి సంగమేశ్వరాలయాన్ని దర్శించుకొని స్వామివారికి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. మండల పశు వైద్యాధికారి డాక్టర్ హర్షవర్ధన్ ఉన్నారు.

ఆధునిక వ్యవసాయ పద్ధతులపై అవగాహన

జహీరాబాద్, డిసెంబర్ 10: పంటల సాగుపై డీడీఎస్ మహిళా రైతులకు మంగళవారం అంతర్జాతీయ స్వచ్ఛంద సంస్థ సెంటర్ ఫర్ అగ్రికల్చర్ అండ్ బయోసైన్స్ ఇంటర్నేషనల్ అధికారులు, సుస్థిర వ్యవసాయ కేంద్రం, డీడీఎస్-కేవీకే శాస్త్రవేత్తల సహకారంతో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా స్థానిక డీడీఎస్ కార్యాలయంలో మహిళా రైతులకు పంటల సాగు, అశించే తెగుళ్లు, చీడపురుగుల నివారణ, అధునిక వ్యవసాయ పద్ధతులపై శాస్త్రవేత్తలు, అధికారులు అవగాహన కల్పించారు. కార్యక్రమం లో శాస్త్రవేత్తలు స్నేహలత, రమేశ్, అధికారులు చంద్రశేఖర్, మంజరి పాల్గొన్నారు.

తహసీల్‌లో ఆర్డీవో తనిఖీ

తహసీల్దార్ రాధను సమ్యలను అడిగి తెలుసుకుంటున్న ఆర్డీవో రవీందర్‌రెడ్డి

అమీన్‌పూర్, డిసెంబర్ 10: అమీన్‌పూర్ తహసీల్ కార్యాలయాన్ని మంగళవారం సంగారెడ్డి ఆర్డీవో రవీందర్‌రెడ్డి పర్యటించి పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన పలు వివరాలను తహసీల్దార్ రాధను అడిగి తెలుసుకున్నారు. ప్రజలనుంచి వచ్చే భూ సమస్యలపై ప్రత్యేక శ్రద్ధ చూపించి పరిష్కరించాలన్నారు.

ఆశ వర్కర్ల ముదస్తు అరెస్టు

హైదరాబాద్‌కు పోకుండా స్థానిక పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

రాయికోడ్, డిసెంబర్ 10: ఆశ వర్కర్ల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ హైదరాబాద్ తరలివెళ్తున్న మండల పరిధిలోని ఆశ వర్కర్లను ముదస్తు అరెస్ట్ చేసినట్లు స్థానిక ఎస్ఐ నారాయణ తెలిపారు. మంగళవారం రాయికోడ్ పోలీస్ స్టేషన్‌లో వివిధ గ్రామాల్లోని ఆశ వర్కర్లను అరెస్ట్ చేసి,

లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

లబ్ధిదారులకు చెక్కులు అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

నిజాంపేట్, డిసెంబర్ 10: మండల పరిధిలోని మునిగేపల్లి గ్రామానికి చెందిన లబ్ధిదారుడు పుట్టి దత్తుకు ముఖ్యమంత్రి సహాయనిధి కింద మంజూరైనా చెక్కును మంగళవారం మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి వారి ఇంటికి వెళ్లి అందజేశారు. మాజీ జేడ్పీటీసీ రవీందర్‌నాయక్, మాజీ సర్పంచ్ నవాజ్ పాటిల్, మాజీ ఎంపీటీసీ ముజామ్మిల్, నాయకులు అంజాగౌడ్, మల్లోండా, అంజిరెడ్డి, రాజు జ్ఞానేశ్వర్ ఉన్నారు.

జిల్లాలో 658 పంచాయతీలు

మాట్లాడుతున్న కలెక్టర్ వల్లూరు క్రాంతి

సంగారెడ్డి కలెక్టరేట్, డిసెంబర్ 10: జిల్లాలో గ్రామ పంచాయతీల సంఖ్య 658కి చేరిందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వల్లూరు క్రాంతి తెలిపారు. నూతనంగా 11 గ్రామ పంచాయతీలు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. పోలింగ్ కేంద్రాల ఏర్పాటుపై రాజకీయ పార్టీల ప్రతినిధులతో మంగళవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల్లో 650 మంది ఓటర్లకు ఒక పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. ముసాయిదా, పోలింగ్ స్టేషన్ జాబితా, ఓటరు జాబితాలో అభ్యంతరాలుంటే ఈ నెల 12వ తేదీన తెలియజేయాలని కోరారు. జిల్లాలో 5,718 వార్డుల్లో పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. జిల్లాలో మొత్తం 8,51,420 మంది ఓటర్లు ఉన్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, డీపీవో సాయిబాబా పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

గండిగూడెంలో పర్యటిస్తున్న మున్సిపల్ చైర్మన్ పాండురంగారెడ్డి

అమీన్‌పూర్, డిసెంబర్ 10: గ్రామాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి చొరవ చూపుతానని అమీన్‌పూర్ మున్సిపల్ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం అమీన్‌పూర్ మున్సిపల్‌లో నూతనంగా విలీనమైన గ్రామాలైన దయార, గండిగూడెం, గండిగూడం కాలనీల్లో పర్యటించి సమస్యలపై ఆరాతీశారు. స్థానిక తాజా మాజీ సర్పంచ్ భాస్కర్‌గౌడ్‌తో కలిసి స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్త ప్రభుత్వంలో అమీన్‌పూర్ మండల పరిధిలోని గ్రామాలు మున్సిపల్‌లో విలీనమయ్యాయని, అందుకు అనుగుణంగా ఆయా గ్రామాల్లో పర్యటించి సమస్యలను పరిష్కరిస్తామన్నారు.

మెనూ ప్రకారం భోజనం పెట్టాలి

కంగ్టి, డిసెంబర్ 10: స్థానిక ఎస్సీ, బీసీ హాస్టళ్లను సోమవారం ఎంపీడీవో సత్తయ్య తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల గదులను పరిశీలించారు. అనంతరం ఉదయం వేళలో విద్యార్థులకు అందజేసిన టిఫిన్‌ను పరిశీలించారు. మెనూ ప్రకారం టిఫిన్ అందించాలని వార్డెన్ రామప్పకు సూచించారు. ప్రభుత్వం విద్యార్థుల సంక్షేమానికి అనేక పథకాలు ప్రవేశపెట్టిందని పేర్కొన్నారు. ఎంపీవో సుభాశ్ పాల్గొన్నారు.

చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలి



విద్యార్థులకు స్పోర్ట్స్ కిట్లను అందజేస్తున్న సంక్షేమ అధికారి జగదీశ్వర్

ఝరాసంగం, డిసెంబర్ 10: మండల కేంద్రంలోని బీసీ బాలుర వసతి గృహంలో కలెక్టర్ ఆదేశాల మేరకు మంగళవారం విద్యార్థులకు సీఎస్ఆర్ నిధుల కింద ఉలెన్ బ్లాంకెట్లు, క్రికెట్, వాలీబాల్ కిట్లను జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి జగదీశ్వర్ పంపిణీ చేశారు. వీటిని సద్వినియోగం చేసుకొని విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోను రాణించి పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి లలితకుమారి, మండల అభివృద్ధి అధికారి సుధాకర్, బీసీ బాలుర వసతి గృహం వార్డెన్ శారద పాల్గొన్నారు.

బాడీ బిల్డింగ్ పోటీల్లో సంతోష్‌కుమార్‌కు సిల్వర్

రామచంద్రాపురం, డిసెంబర్ 10: భారతీనగర్ డివిజన్ ఎల్ఐజీకి చెందిన సంతోష్ కుమార్ బాడీ బిల్డింగ్ పోటీల్లో సత్తాచాటాడు. ఇటీవల కూకట్‌పల్లిలో స్టాలియన్ ఫిట్‌నెస్ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి బాడీ బిల్డింగ్ పోటీల్లో సంతోష్‌కుమార్ రెండో స్థానంలో నిలిచి సిల్వర్ మెడల్ సాధించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రస్థాయి బాడీ బిల్డింగ్ పోటీల్లో సిల్వర్ మెడల్ సాధించడం సంతోషంగా ఉన్నదని తెలిపారు. ముమ్ముందు మరిన్ని పతకాలు సాధిస్తానని చెప్పారు. పోటీల్లో మెడల్ సాధించడానికి తోడ్పాటునందించిన ట్రైనర్ షేక్‌అన్వర్‌కు ధన్యవాదాలు తెలిపారు.

విధుల్లో నిర్లక్ష్యం వద్దు

- డీఆర్డీఏ అదనపు పీడీ బాల్‌రాజు
- ఉపాధి హామీ పనుల్లో అవకతవకలు
- విధుల్లో నిర్లక్ష్యం చేసిన వారిపై వేటు

ప్రజా దర్బార్‌లో మాట్లాడుతున్న డీఆర్డీఏ అదనపు పీడీ బాల్‌రాజు

రాయికోడ్, డిసెంబర్ 10: ఉపాధి హామీ పథకంలో నిర్లక్ష్యం వహించిన సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకుంటామని డీఆర్డీఏ అదనపు పీడీ బాల్‌రాజు అన్నారు. మంగళవారం జిల్లా గ్రాంథాలయ సంస్థ చైర్మన్ అంజయ్య సమక్షంలో రాయికోడ్ మండలంలోని వివిధ గ్రామాల్లో 2024 మార్చి వరకు రూ.7.54 కోట్ల ఉపాధీ హామీ పనులు చేపట్టారు. వీటికి సంబంధించి వారంపాటు తనిఖీలు చేసి గ్రామ సభలు నిర్వహించారు. ప్రజాదర్బార్‌లో గ్రామాల వారీగా పంచాయతీ కార్యదర్శులు, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్స్ నిర్లక్ష్యంతో అనుకున్న మేర లక్ష్యం నెరవేరలేదని తెలింది. డిమాండ్ పెట్టిన పనులు చూపించకపోవడం, దరఖాస్తు చేసుకున్న వారికి జాబ్ కార్డులు ఇవ్వకపోవడం, పొలాల్లో నాటిన టేకు మొక్కల జాడలేకపోవడం, అవెన్యూ కమ్యూనిటీ ప్లాంటేషన్ నిర్వహణలో నిర్లక్ష్యం వహించడం ఫలితంగా సర్వేల్ రేటు తగ్గిపోయినట్లు ఆడిట్ అధికారులు గుర్తించారు. రికార్డులు సరిగా నిర్వహించకపోవడం కూలీలకు పే స్లిప్‌లు ఇవ్వకపోవడం, ఫొటోల నిర్వహణ సరిగా లేకపోవడం వంటివి తేలాయి. వీటి కారణంగా పలుపురు పంచాయతీ కార్యదర్శులు, టెక్నికల్ అసిస్టెంట్లు, మేట్‌లకు జరిమానా విధించారు. ఈ సందర్భంగా డీఆర్డీఏ అదనపు పీడీ బాల్‌రాజు డీఆర్డీఏ పీడీ శ్రీనివాస్‌రావు మాట్లాడుతూ.. అన్ని గ్రామాల్లో సోమవారం నాటికి 100 శాతం కూలీల సంఖ్యను పెంచాలన్నారు. గ్రామాల నుంచి వలస వెళ్లకుండా జాబ్‌కార్డు ఉన్న ప్రతి ఒక్కరికీ పని కల్పించి, కూలీల సంఖ్యను పెంచాలన్నారు. కొలతల ప్రకారం నాణ్యతగా పనులు ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏపీడీ రాజు, ఏవీవో నాగేశ్వర్‌రావు, క్యూసీ సుభాష్, ఎంపీడీవో ఎంఎం షరీఫ్, ఎంపీవో అంజాలీదేవి, ఏపీవో రామేశ్, మండల ఉపాధి హామీ క్యూసీ విష్ణువర్ధన్‌సాగర్, ఉపాధిహామీ సిబ్బంది తుకప్ప, మూరాలి, వరప్రసాద్, కరుణయ్య, సురేశ్ పాల్గొన్నారు.

గ్రూప్-2కు 41 పరీక్ష కేంద్రాలు

మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ చంద్రశేఖర్

సంగారెడ్డి కలెక్టరేట్, డిసెంబర్ 10: జిల్లాలో గ్రూప్-2 పరీక్ష నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ స్పష్టం చేశారు. మంగళవారం కలెక్టరేట్‌లోని మినీ సమావేశ మందిరంలో గ్రూప్-2 పరీక్ష నిర్వహణపై సంబంధిత అధికారులతో అదనపు కలెక్టర్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 15, 16 తేదీలలో నిర్వహించే గ్రూప్-2 పరీక్షల నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లపై సమీక్షించారు. గ్రూప్-2 పరీక్షలు ఓఎంఆర్ పద్ధతిలో నిర్వహించేందుకు జిల్లాలో 41 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. పరీక్షల నిర్వహణకు అవసరమైన ఇన్విజిలేటర్స్, శాఖా పరమైన అధికారులు, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు నియమించాలన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. జిల్లాలో మొత్తం 15,218 మంది అభ్యర్థులు పరీక్షలకు హాజరు కానున్నట్లు తెలిపారు. ఈ నెల 15న ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు, తిరిగి మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు, ఈ నెల 16న ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు, తిరిగి మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు మొత్తం నాలుగు దఫాలుగా పరీక్షలు ఉంటాయన్నారు. అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన అన్ని మౌలిక వసతులను పరీక్షా కేంద్రాల్లో ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. సమావేశంలో అదనపు ఎస్పీ సంజీవరావు, డీపీవో సాయిబాబా, డీఈవో వెంకటేశ్వర్లు, డీఏం అండ్ హెచ్‌వో డాక్టర్ గాయత్రీదేవి, ఇంటర్మీడియట్ అధికారి గోవిందరామ్ పాల్గొన్నారు.

యాసంగి సాగుపై అవగాహన

బొల్లారం డిసెంబర్ 10: యాసంగి సాగుపై ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలు రైతులకు వ్యవసాయ శాఖ అధికారులకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సూచనలు, సలహాలను అందించారు. మంగళవారం జిన్నారం మండలం సోలక్‌పల్లిలోని రైతు వేదిక వద్ద ఏవో రవీందర్ రెడ్డి మండలంలోని రైతులతో కలిసి సమావేశమై వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. యాసంగిలో ఏఏ పంటలు సాగు చేయాలో, వాటికి అందించే నీటి తడులు, నీటి సౌకర్యంపై సూచనలు, సలహాలు ఇచ్చారు. చీడపీడల నివారణకు ముందుగా చేయాల్సిన యజమాన్య పద్ధతులను వివరించారు. కార్యక్రమంలో ఏఈవోలు అజారుద్దీన్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఇచ్చిన హామీలు అమలు చేయాలి

పుల్కల్‌లో ఆశ వర్కర్ల నిరసనకు మద్దతు తెలుపుతున్న సీఐటీయూ నాయకులు

పుల్కల్, డిసెంబర్ 10: ఇచ్చిన హామీలు అమలు చేయమంటే అరెస్టు చేస్తారా అని సీఐటీయూ జిల్లా కార్యదర్శి సాయిలు అన్నారు. మంగళవారం పుల్కల్ మండల ప్రజా పరిషత్ కార్యాలయం ఉదుట ఆశ వర్కర్లు చేపట్టిన నిరసన దీక్షలో పాల్గొన్నారు. అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరన్నారు. ఆశ వర్కర్లకు రూ.18 వేలు వేతనం ఇవ్వాలని, ఈఎస్ఐ, పీఎఫ్, ఇన్సూరెన్స్, ఇతర చట్ట పరమైన సౌకర్యాలు అమలు చేయాలని, లెప్రసీ, పల్స్ పోలియో పెండింగ్ డబ్బులు చెల్లించాలన్నారు. చలో హైదరాబాద్ బయలుదేరిన ఆశ వర్కర్లు, నాయకులను అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించడం సరైంది కాదన్నారు. కార్యక్రమంలో అందోల్ డివిజన్ సిఐటియు కార్యదర్శి విద్యాసాగర్,కృష్ణ, ఆశ వర్కర్లు విమల,విట్టబాయి,లక్ష్మీ,సరోజ,పద్మ తదితరులు పాల్గొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

జహీరాబాద్, డిసెంబర్ 10: పేకాట స్థావరంపై చిరాగ్‌పల్లి పోలీసులు దాడి చేసి పది మంది పేకాట రాయుళ్లను అరెస్టు చేశారు. ఈ ఘటన మొగుడంపల్లి మండలం చిరాగ్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని గోవిందపూర్ శివారులో మంగళవారం చోటుచేసుకుంది. చిరాగ్‌పల్లి ఎస్ఐ రాజేందర్‌రెడ్డి కథనం ప్రకారం.. నమ్మదగ్గ సమాచారంతో జహీరాబాద్ పట్టణ సీఐ శివలింగం ఆధ్వర్యంలో ఎస్ఐ రాజేందర్‌రెడ్డి సిబ్బందితో కలిసి గోవిందపూర్ శివారులోని అటవీ ప్రాంతంలో పేకాట స్థావరంపై దాడులు చేసి పేకాట ఆడుతున్న పది మందిని పట్టుకున్నారు. వారి నుంచి రూ.1.42 లక్షల నగదు, పది సెల్‌ఫోన్లు, మూడు కార్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వైభవంగా పోలేరమ్మ ఆలయ వార్షికోత్సవం